క్లుప్తంగా

'నన్నయ'లో ఉచిత వైద్య శిబిరం



కంటి పరీక్ష చేయించుకుంటున్న వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ, సెంట్రల్ లైబ్రరీలో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని వీసీ ఆచార్య ఎస్. ప్రసన్నశ్రీ ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ శిబిరంలో విద్యార్థులు, అధ్యాపకులతో పాటు వీసీ కూడా కంటి పరీక్షలు చేయించుకున్నారు. రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రి, డాక్టర్ అగర్వాల్ కంటి ఆస్పత్రి, శ్రీవాణి దంత వైద్యశాల వైద్యులతోపాటు స్థానిక జీఎస్ఎల్ వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, అధ్యాపకులు డి.జ్యోతిర్మయి, పి.వెంకటేశ్వర్రావు, ఎస్.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పోషణ్‌బీ, పడాయిబీపై శిక్షణ

పెదపూడి: రామేశ్వరంలో గురువారం అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్‌బీ, పడాయిబీపై శిక్షణ తరగతులు నిర్వహించనున్నామని కాకినాడ అర్బన్ ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్లు శ్రీగౌరీ, శ్రీపద్మ తెలిపారు. వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పోషకాహారం, విద్య రెండు అందించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమం ప్రారంభించిందన్నారు. ఈ శిక్షణ తరగతులు 20, 21, 22 తేదీల్లో జరుగుతాయన్నారు.

వినాయకుడికి పంచామృతాభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో వినాయకుడు

పెదపూడి: సంపర గ్రామంలో పంట కాలువ సమీపంలో ఉన్న ప్రసిద్ధి చెందిన సిద్ధి వినాయకునికి బుధవారం గరికిపూజ, పంచామృతాభిషేకాలు చేశారు. పండితులు హనుమంతాచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు వచ్చి స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కుల వృత్తి సంఘాలతో నేడు సమావేశం

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం కుల వృత్తుల సంఘాలతో సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఎం.భారతి తెలిపారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదరణ-3 పథకం ప్రవేశపెట్టుటకు ప్రణాళికలు రూపొందించేందుకు మండలంలోని కుల వృత్తుల సంఘాలతో సమావేశం నిర్వహిస్తోందని తెలిపారు. వృత్తిదారులకు ఏ పనిముట్లు కావాలో సమాచారం సేకరిస్తామన్నారు. గురువారం ఉదయం 10.30 గంటలకు మండల స్థాయి సమావేశం జరుపుతామన్నారు. వెనుకబడిన తరగతుల కుల వృత్తి సంఘ నాయకులు తప్పని సరిగా సమావేశానికి హాజరు కావాలని ఎంపీడీఓ భారతి కోరారు.

వర్గీకరణ పేరుతో రిజర్వేషన్ల రద్దుకు కుట్ర



రాజానగరంలో ర్యాలీ చేస్తున్న దృశ్యం

రాజానగరం: ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర క్యాబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ అఖిల భారత మాలల సంఘాల జేఏసీ పిలుపు మేరకు రాజానగరంలో బుధవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. గాంధీ బొమ్మ సెంటరులో మానవహారంగా ఏర్పడి క్యాబినెట్ నిర్ణయానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎస్సీ వర్గీకరణ పేరుతో రిజర్వేషన్ల రద్దుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. సుప్రీం కోర్టు తీర్పులో పేర్కొన్న సూచనలను పాటించడం లేదన్నారు. రాజ్యాంగ పరిరక్షణ సమితి జిల్లా కన్వీనర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాలల ఐక్య వేదిక కన్వీనర్ ముప్పిడి శ్రీను, మాల మహానాడు జాతీయ నాయకులు తుమ్మల తాతారావు, బీఎస్పీ నాయకులు కొల్లాటి అబ్బులు, ప్రత్తి నాగేశ్వర్రావు, చినవెంకన్న, సూర్యారావు, బొర్రా కాశీ, జాలెం కుమార్, మేకల చినవీర్రాజు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల బస్టాండ్

- ఆక్రమణలో కోరుకొండ బస్టాండ్
- అద్దెలు చెల్లించని వ్యాపారులు
- నిర్వాహణలో లోపం
- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు



కోరుకొండ బస్టాండ్



బస్టాండ్‌లో వేచి ఉన్న ప్రయాణికులు

మధురపూడి: రాకపోకలు సాగించే ప్రయాణికులకు నీడనిచ్చే బస్టాండ్ ఆక్రమణకు గురైంది. ఇక్కడ సదుపాయాలు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. మండల కేంద్రమైన కోరుకొండ ఆర్టీసీ బస్టాండ్ ఆక్రమణదారుల చెరలో చిక్కుకుంది. 516 జాతీయ రహదారిపై 0.51 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న బస్టాండ్ సమస్యలకు నిలయంగా మారింది. ఈ బస్టాండ్ ఆవరణ 9 దుకాణాలున్నాయి. వీటిలో మూడు పర్మినెంట్ దుకాణాలు ఉండగా మిగిలినవి టెంపరరీ దుకాణాలు ఉన్నాయి. ఈ దుకాణదారులు అద్దె సక్రమంగా చెల్లించడంలేదు. దీంతో అక్కడ నిర్వహణ సక్రమంగా సాగక ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.

సదుపాయాలు లేక..

స్థానిక చెరువు ప్రాంతాన్ని బస్టాండ్ నిమిత్తం కేటాయించారు. దానిని ఆర్టీసీ బస్టాండ్‌గా అభివృద్ధి చేశారు. తర్వాత అక్కడ ఆటో స్టండ్ పేరిట కొందరు ఆటోలను ఏర్పాటు చేసుకున్నారు. ఇదే అదునుగా కొంతమంది వ్యాపారులు చొరబడ్డారు. అవి పెరిగి తొమ్మిది దుకాణాలు ఏర్పడ్డాయి. వీరంతా వాడిన చెత్త, వ్యర్థ పదార్థాలను తొలగించి, శుభ్రం చేయడంలో పంచాయతీ పారిశుధ్య కార్మికులకు పని ఒత్తిడి పెరిగింది. క్రమంగా ఇక్కడ పరిశుభ్రత లోపించింది. దీంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.

ఈ బస్టాండులో రోజూ 500 మంది ప్రయాణికులు వేచి ఉండ గల సామర్థ్యం ఉంది. సుదూర ప్రాంతాలకు చెందిన బస్సు సర్వీసులు కూడా ఈ మార్గం గుండా రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతోపాటు కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవాల సందర్భంగా ప్రయాణికుల సంఖ్య పెరుగుతుంది. అయితే ప్రయాణికులకు సరిపడే సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు.

అద్దెలు సక్రమంగా చెల్లించకపోవడంతో..

ఏజెన్సీ ప్రాంతానికి చెందిన బస్సులతో పాటు, చత్తీస్ఘఢ్, ఒడిశా, తెలంగాణా రాష్ట్రాలకు చెందిన బస్సు సర్వీసులు, విశాఖ, విజయనగరం జిల్లాలకు చెందిన బస్సులు ఈ బస్టాండు మీదుగానే రాక,పోకలు సాగిస్తుంటాయి. అలాగే కోరుకొండ, గోకవరం, దేవీపట్నం విలీనమండలాలకు చెందిన బస్సుల రాకపోకలు ఈ మార్గం నుంచి జరుగుతోంది. ఇంతటి ప్రాధాన్యం ఉన్న ఈ బస్టాండ్ పరిశుభ్రంగా లేకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. బస్టాండ్‌లో ఉన్న దుకాణదారులు అద్దెలు సక్రమంగా చెల్లిస్తే నిర్వహణ జరుగుతుంది. కానీ వారు అధికారులు వచ్చి అడిగినా అద్దెలు చెల్లించడంలేదు. దీంతో నిర్వహణ కష్టమవుతోంది.



బస్టాండ్ ఆవరణలో వ్యాపార సంస్థలు

చర్యలు తీసుకుంటా..



ఆధ్యాత్మిక కేంద్రమైన కోరుకొండలోని ఆర్టీసీ బస్టాండ్‌లో సౌకర్యాల కల్పనకు ప్రతిపాదనలను ఏపీ ఎస్ఆర్టీసీలోని ఉన్నతాధికారులకు పంపిస్తాం, దానిలో భాగంగా అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నాం. ఇటీవలే హైదరాబాద్ నుంచి గోకవరం ఆర్టీసీ డిపో మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టాను. సమీక్షా సమావేశాల నంతరం చర్యలు తీసుకుంటాను.

– సీహెచ్ కె.సుచరిత మార్గరేట్, గోకవరం డిపో మేనేజర్

సౌకర్యాలు కల్పించాలి



కోరుకొండలోని బస్‌స్టాండ్‌ను సౌకర్యవంతంగా తీర్చిదిద్దాలి. దీని కోసం ఆర్టీసీ, పంచాయతీరాజ్ శాఖ అధికారులు కృషి చేయాలి. స్వామివారి దర్శనానికి వస్తున్న ప్రయాణికులు, మహిళలకు మరుగుదొడ్లు లేక ఇబ్బంది పడుతున్నారు. ఆక్రమణలకు అవకా శం లేకుండా చూడాలి. సౌకర్యాలు కల్పించాలి

– కోదూరి సత్తిరెడ్డి, కోరుకొండ

పిల్లలను సన్మార్గంలో నడిపే బాధ్యత తల్లిదండ్రులదే



దోమాడలో యువత మేలుకో కార్యక్రమంలో మాట్లాడుతున్న సీతాపతిరావు

పెదపూడి: పిల్లలు చక్కని బాటలో నడిచే బాధ్యత తల్లిదండ్రులు తీసుకోవాలని తద్వారా పిల్లలు ఉత్తమ పౌరులుగా, సన్మార్గంలో పయనిస్తారని తహసీల్దార్ పీవీ సీతాపతిరావు అన్నారు. దోమాడ గ్రామంలోయువత మేలుకో' కార్యక్రమంపై బుధవారం ఎక్సైజ్, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీతాపతిరావు, ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో చాలా మంది చిన్న వయస్సు నుంచే మత్తు మందులకు అలవాటు పడి వారి విలువైన జీవితాలు నాశనం చేసుకుంటున్నారన్నారు. యువత మత్తు మందుకు అలవాటు పడకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులపై ఉందన్నారు. ప్రతి కుటుంబంలో తండ్రి పిల్లలకు రోల్ మోడల్‌గా ఉంటారని, తండ్రి చేసే పనుల్ని పిల్లలు అనుసరిస్తారన్నారు. ఈ నేపథ్యంలో పిల్లలపై ప్రతి తల్లిదండ్రులు బాధ్యత వహించాలన్నారు. పిల్లలు వాడుతున్న మొబైల్ ఫోన్లు వినియోగం, బయటకు వెళ్లి వచ్చే సమయాలు పరిశీలించుకోవాలన్నారు. స్నేహపూర్వకంగా పిల్లలతో తల్లిదండ్రులు మెలగాలన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఆలీ, వీఆర్వో పూసల నాగేశ్వరరావు, ఎక్సైజ్ హెచ్‌సీ రాజు, సిబ్బంది సుబ్రహ్మణ్యం, శివరాజు, కొప్పోజు సూర్యసత్తిబాబు, కాకర గోవిందు, మద్దిపూడి దొరబ్బాయి. పొన్నం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల ఆదాకు పీఎం సూర్యఘర్ యోజన

దివాన్ చెరువులో అవగాహన ర్యాలీ



దివాన్‌చెరువులో అవగాహన ర్యాలీ చేస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

రాజానగరం: విద్యుత్ చార్జీలను ఆదా చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వ అమలు చేస్తున్న ప్రధానమంత్రి సూర్యఘర యోజన పథకం తోడ్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ రాజమహేంద్రవరం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దాట్ల శ్రీధర్‌వర్మ అన్నారు. పీఎం సూర్యఘర్ యోజన పథకంపై అవగాహన కలిగిస్తూ విద్యుత్ ఆధ్వర్యంలో దివాన్ చెరువులో బుధవారం నిర్వహించిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఇంటి పైకప్పులపై సౌర్య ఫలకాలను ఏర్పాటు చేయడం ద్వారా ఆయా గృహాలకు అవసరమైన విద్యుత్‌ని పొందడంతోపాటు మిగులు విద్యుత్ ద్వారా కొంత ఆదాయాన్ని పొందవచ్చన్నారు. అలాగే రైతులు కూడా పంట పొలాలలో వీటిని అమర్చడం ద్వారా ఆర్థిక ప్రయోజనాలను అందుకోవచ్చన్నారు. ఒక కిలోవాట్ సోలార్ రూఫ్ ఏర్పాటుకు రూ.30 వేలు, రెండు కిలోవాట్స్‌కి రూ.60 వేలు, మూడు కిలోవాట్స్‌కి రూ.78 వేలు గరిష్టంగా రాయితీ లభిస్తుందన్నారు. మండలంలోని కలవచర్లలో రెండు కిలోవాట్స్ ప్లాంట్స్‌కి టెండర్లు పిలిచామన్నారు. పోలవరం ఎడమ కాలువ కింది దీని ఏర్పాటుకు నీటి పారుదల శాఖ అధికారుల ద్వారా కలెక్టరుకు లేఖ రాశామన్నారు. ఈ ప్లాంట్ ఏర్పడితే పంట పొలాలకు అవసరమైన సాగు నీటిని సరఫరా చేయవచ్చన్నారు. గృహ వినియోగదారులు 50 శాతం రాయితీతో ఈ పథకం ద్వారా ప్రయోజనాలను పొందవచ్చన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈఈ కోరారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అధికారులు ఎం. రవికుమార్, పి. సన్యాసిరావు, వి.సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

వాసు సేవలు అభినందనీయం

మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ



వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు ప్రమాదబీమా నమూనాను విడుదల చేస్తున్న చెల్లుబోయిన వేణు, జక్కంపూడి రాజా, చందననాగేశ్వర్ తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: వైఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షుడు యెజ్జు వాసు అనునిత్యం ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తూ, పార్టీ కార్యకర్తలకు బీమా సౌకర్యం కలిప్పించడం అభినందనీయమని మాజీమంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. యెజ్జు వాసు జన్మదినం సందర్భంగా బుధవారం కాతేరు గ్రామంలో వైభవ్ ఫంక్షన్ హాల్లో ఉచిత వైద్య శిబిరం, వృద్ధులకు చీరల పంపిణీ, కార్యకర్తలకు పోస్టల్ ప్రమాదబీమా బాండ్లు ,సైకిల్‌కిట్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలను చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చేతుల మీదుగా ప్రారంభించారు. ఈసందర్భంగా చెల్లుబోయిన వేణు మాట్లాడుతూ యెజ్జు వాసు పుట్టినరోజు సందర్భంగా నమ్ముకున్న సిద్ధాంతాలతో ముందుకు వెళుతూ పార్టీకి అండగా నిలుస్తున్న 200 మందికి రూ.10లక్షల ప్రమాద బీమా చేయించడం అభినందనీయమన్నారు. మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ యెజ్జు వాసు పుట్టినరోజు సందర్భంగా ఎటువంటి ఆర్భాటాలకు వెళ్లకుండా సేవా కార్యక్రమంలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఈసందర్భంగా యెజ్జు వాసును శాలువాతో ఘనంగా సత్కరించారు. ఉచిత వైద్యశిబిరం అనంతరం రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటీఫికేషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ చందన నాగేశ్వర్, మండలపార్టీ అధ్యక్షుడు ఉప్పులూరి వీర వెంకట సత్యనారాయణలు మాట్లాడారు. యెజ్జు వాసు మాట్లాడుతూ పార్టీకి అండగా నిలుస్తున్న కార్యకర్తలకు తనవంతు సాయంగా 200 మందికి రూ.10లక్షల ప్రమాదబీమాను చేయించామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ముద్దాలఅను, ఆచంట కల్యాణ్, కూచిపూడి రామారావు, మండలంలోని పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అందరి చూపు.. సోలార్ వైపు..

- కూటమి ప్రభుత్వంలో కరెంట్ చార్జీల షాక్
- యూనిట్ రేట్లు పెంచిన సర్కార్
- తక్కువ ఖర్చుతో సౌర వెలుగులు
- ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్ట్ బిజిలి యోజన
- సబ్సిడీ అందిస్తున్న కేంద్ర ప్రభుత్వం




పెరిగిన విద్యుత్ వాడకం

సీటీఆర్ఐ: వేసవి వచ్చేసింది. వేడిమి పెరుగుతోంది. ఉక్కపోత కారణంగా ప్రతి ఇంట్లో ఫ్యాన్, ఏసీ తిరుగుతూనే ఉంటోంది. దీంతో కరెంట్ వినియోగం అధికమవుతోంది. కూటమి ప్రభుత్వం వచ్చి పది నెలలు అవుతున్నా ఏ ఒక్క సంక్షేమ పథకం అమలు చేయలేదని గానీ ప్రజలపై కరెంట్ చార్జీల మోతను మోగించింది. ప్రభుత్వం సంపద సృష్టిస్తానంటూ కరెంట్ యూనిట్ రేట్లు పెంచి ప్రజల నడ్డి విరగ్గొడుతోంది. దీంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు కరెంట్ బిల్ రాగానే గుండె గుబేల్‌మంటోంది. వందల స్థాయి నుంచి వేల రూపాయల కరెంట్ బిల్లులు రావడంతో సామాన్యలు లబోదిబోమంటున్నారు. దీంతో చాలా మంది సోలార్ వెలుగులపై మక్కువ చూపుతున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో విద్యుత్ వాడకం పెరిగింది. దీంతో ఏసీ, ఫ్రీజ్‌లు, ఫ్యాన్లు వాడకం విపరీతంగా పెరిగిపోయింది. విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు పేద ప్రజలకు పెను భారంగా మారింది. రూ.10 వేలు, రూ.12 వేలు విద్యుత్ బిల్లులు చెల్లించే వినియోగదారులు, సోలార్ ఎనర్జీ ని వినియోగించడం ద్వారా కేవలం 3 వేలకు విద్యుత్ బిల్లులు తగ్గించకోవచ్చు. కాలుష్యాన్ని తగ్గించేందుకు పవన విద్యుత్తు, సోలార్ విద్యుత్తుతోనే కాలుష్యాన్ని అరికట్టవచ్చు. ఎండలు, వెలుతురు ఎక్కువగా ఉండే మన ప్రాంతంలో సోలార్ ఎనర్జీకి అన్ని రకాలుగా సౌకర్యంగా రాజమహేంద్రవరం బాగా అభివృద్ధి చెందడంతోపాటు నగరం విస్తీర్ణం పరిధి కూడా పెరుగుతోంది. దానవాయిపేట, ప్రకాష్ నగర్, తిలక్‌రోడ్డు, జేఎన్ రోడ్డు, ఏవీ అప్పారావు రోడ్డు వంటి ప్రాంతాలలో పలు షాపింగ్ మాల్స్, రెస్టారెంట్లు, ఆసుపత్రులు, కాలేజీలు ఎక్కువగా ఏర్పాటు చేస్తున్నారు. ఇటువంటి వాణిజ్య ప్రధాన షాపులలో ఇప్పుడు అందరూ సోలార్ ఎనర్జీ వైపు దృష్టి సారిస్తున్నారు. డొమిస్టిక్‌తోపాటు, కమర్షియల్ కూడా విద్యుత్ యూనిట్ స్లాబ్ సిస్టమ్ మారడంతో విద్యుత్ బిల్లును తట్టుకోలేని పరిస్థితిలో ఉన్నారు. దీనితో వారంతా సోలార్ ప్యానల్స్ ఏర్పాటు వైపు మొగ్గు చూపుతున్నారు.

పీఎం సూర్యఘర్ యోజనలో సబ్సిడీ

ప్రధాని నరేంద్ర మోదీ సౌర విద్యుత్‌ని ప్రోత్సహించడానికి పీఎం సూర్యఘర్ యోజనలో సబ్సిడీ అందజేస్తున్నారు. రాబోయే రోజుల్లో బొగ్గు కొరత వంటి పరిస్థితులను అధిగమించడానికి సౌర విద్యుత్‌ను ప్రోత్సహించడం అనివార్యమవుతుంది. వినియోగం పెరిగితే, సోలార్ పానెల్స్ ధరలు కూడా తగ్గుతాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు. 3 కిలోవాట్ కెపాసిటీకి ఒక్కొక్క కిలోవాట్‌కి రూ.18 వేలు వరకు సబ్సిడీ వస్తుంది. పది కిలోవాట్ కెపాసిటీకి రూ1,17,00 సబ్సిడీ అందుతుంది.


సంపూర్ణ మద్దతు ఇస్తాం



రాజమహేంద్రవరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఏర్పాటు చేసిన ప్రేయర్ ఎనర్జీలో సోలార్ ప్లాంట్లకి కావాల్సిన అన్ని అందుబాటులో ఉన్నాయి. గత 11 ఏళ్లుగా తమ సంస్థ పనిచేస్తోంది. ఒక మెగావాట్ సౌర విద్యుత్‌కి 60 నుంచి 70 వేల రూపాయలు ఖర్చు అవుతుంది. కేంద్ర ప్రభుత్వం నుంచి 30 వేల రూపాయల వరకు సబ్సిడీ ఇస్తుంది. అయితే మెగావాట్లు పెరిగే కొద్దీ ప్రయోజనం ఎక్కువ ఉంటుంది. సౌర విద్యుత్ అమర్చుకోడానికి పదేళ్ల కాల పరిమితికి బ్యాంకు రుణాలు కూడా ఇస్తుంది. ఈఎంఐ ద్వారా రుణం తీర్చుకోవచ్చు. రుణం కూడా వెంటనే మంజూరవుతుంది. సోలార్ ప్యానెల్స్ బిగించడం దగ్గర నుంచి సబ్సిడీ వచ్చే వరకు అన్ని కార్యకలాపాలు సంస్థే నిర్వహిస్తోంది.

– రాధిక చౌదిరి, ప్రేయర్ ఎనర్జీ డైరెక్టర్

25 నుంచి 30ఏళ్ల ప్రయోజనం



సౌర వ్యవస్థలో పెట్టుబడి పెట్టడం 25 నుంచి 30ఏళ్ల వరకు ప్రయోజనం పొందవచ్చు. రాజమండ్రిలోని అనుభవ కేంద్రాలతో, కస్టమర్లకు నేరుగా మద్దతు ఇవ్వడానికి, స్వచ్ఛ విద్యుత్ దిశగా పరివర్తనను సులభతరం చేయడానికి స్థానిక కార్యకలాపాలను బలోపేతం చేస్తున్నాం. కరెంట్ బిల్లులు తగ్గడం ద్వారా మూడు నాలుగేళ్లలోనే పెట్టిన పెట్టుబడి రికవరీ అయిపోతుంది.

– సౌరబ్ మార్డా, ప్రేయర్ ఎనర్జీ ఎండీ

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రంగంపేట: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రాజెక్టు సీడీపీఓ జె.జెస్సీఫ్లోరెన్స్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రంగంపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో అనపర్తి, బిక్కవోలు, రంగంపేట మండలాలకు సంబంధించి ఒక కార్యకర్త, 7 సహాయకుల పోస్టులకు ఖాళీలు ఉన్నాయన్నారు. బిక్కవోలు మండలం కాపవరం-2 అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్త (బీసీ-ఎ), బలభద్రపురం గొల్లపేట-1 (ఓసీ), రంగాపురం-1 (ఎస్సీ), అంగన్‌వాడీ కేంద్రాల్లో సహాయకురాలు పోస్టులు ఉన్నాయన్నారు. రంగంపేట మండలం ఎస్టీరాజాపురం (ఓసీ), పెదరాయవరం-2 (ఓసీ), సుభద్రంపేట (ఓసీ), చంద్రేడు (ఎస్టీ), వడిశలేరు (ఓసీ), గ్రామాల్లో గల అంగన్‌వాడీ కేంద్రాల్లో సహాయకురాలు పోస్టులకు దరఖాస్తులు కోరుతున్నామన్నారు. ఈ పోస్టులకు స్థానిక వివాహిత మహిళలే అర్హులన్నారు. పదో తరతగతి పాసై ఉండాలన్నారు. సంబంధిత ధ్రువపత్రాలు అన్నీ జతపరచాలన్నారు. దరఖాస్తులు ఈనెల 29వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు రంగంపేట ఐసీడీఎస్ కార్యాలయంలో అందజేయాలన్నారు. ఏప్రిల్ 4వ తేదీన అర్హులైన వారికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు.

అంగన్‌వాడీ పోస్టులు దరఖాస్తు చేసుకోండి

బిక్కవోలు: మండలంలోని అంగనవాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ రంగంపేట ప్రాజెక్టు సీడీపీవో జెస్సీ ఫోరెన్స్ తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ బిక్కవోలు మండలంలోని కాపవరం గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్త(బీసీ-ఎ) రంగాపురం గ్రామంలోని అంగన్‌వాడీ సహాయకురాలు (ఎస్సీ) ఖాళీలు ఉన్నాయన్నారు. ఈ నెల 29 తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

వర్షం నీరు నిల్వకు ఏర్పాట్లు



రెయిన్ వాటర్ హార్వెస్టింగ్‌ని ప్రారంభిస్తున్న దృశ్యం

రాజానగరం: వర్షం నీరు వృథాగా పోకుండా స్టోర్ చేసి వినియోగించుకునేందుకు వెలుగుబంద ప్రాథమికోన్నత పాఠశాలలో రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ సిస్టమ్‌ని ఏర్పాటు చేశారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్ డెవలప్‌మెంట్ ప్రొగ్రామ్‌లో భాగంగా ఏర్పాటు చేసిన దీనిని బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్ఎం వై.అగ్నేశ్వరావు, ఎస్ఎంసీ చైర్మన్ ముక్కపాటి దేవి, వాష సంస్థ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పదో తరగతి హిందీ పరీక్షకు 569 హాజరు

బిక్కవోలు: పదో తరగతి పరీక్షల్లో భాగంగా బుధవారం హిందీ పరీక్ష నిర్వహించారు. మండలంలోని బిక్కవోలు, బలభద్రపరం, పందలపాక కేంద్రాల్లో 578 మంది విద్యార్థులు గాను 569 మంది హాజరైనట్లు బిక్కవోలు ఎంఈవో-1 సీహెచ్ సత్యనారాయణ తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడిలో రాజానగరం నియోజకవర్గానికి చెందిన ఐదుగురికి సీఎం రిలీఫ్ ఫండ్ రూ.4,32,231 చెక్కులను రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి బుధవారం అందజేశారు. స్థానిక బూరుగుపూడి జంక్షన్‌లోని ఆయన కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఈ చెక్కులను కోరుకొండ, సీతానగరం, రాజానగరం మండలాలకు చెందిన ఐదుగురికి అందజేశారు.